◆ఈవారం కథ

# రెయిడ్

వరినియా

గూనవలసకు ఉత్తరాన నిశ్శబ్దంగా పారుతోంది గెడ్డ. వంపులు, వంపులుగా గెడ్డ ... వలసచుట్టూ తిరుగుతుంది. ఒక్కో మలుపు ... ఒక్కో రేవు! ఒక రేవులో – జంతువులు దాహం తీర్చుకుంటాయి. ఒక రేవులో – గూనవలస గిరిజనులు స్నాన పానాదులు చేస్తారు. కొండల మీద గల వలసలకు – వ్యాపారం కోసం వచ్చే పల్లం వ్యాపారులు – ఒక రేవులో దాహం తీర్చుకుంటారు గానీ, మరో రేవు వుంది –

ఆ రేవు మీద రెయిడ్ చెయ్యాలి! రెయిడ్ పార్టీ వారిలో చెయ్యబోయే రెయిడ్ పట్ల ఉత్సాహం వుంది. ఎండ నెత్తిమీద పడి – మాడుస్తోంది. ఒంటిమీది గుడ్డలు చెమటకు తడిసి – ముద్ద అయిపోయాయి. పల్లంలో – కన్నవుపేటలో పట్టుకున్న సారా అంతా తాగేసారు. ఈ యెండకు ఆ సారా మత్తు – చెమటంతా కరిగిపోయింది. గెడ్డ దగ్గరికి చేరారు రెయిడ్ పార్టీ వారు.

చల్లటి గెడ్డ నీరు చూసేసరికి – అందరికీ ప్రాణం లేచి వచ్చినట్లైంది. బాణా కర్రలు – గెడ్డ వొడ్డున పడేసి – అందరూ గెడ్డలో దిగేరు. మొహాలు కడుక్కొని, దోసిళ్లతో నీళ్లు తాగేరు. ఆయాసంతో, గెడ్డలో దిగిన ఎక్సయిజ్ కానిస్టేబుల్ శంకర్రావైతే – రొప్పతూ; చెవుల్లో నీళ్లు పోసుకోసాగేడు. అది చూసిన రెయిడ్ పార్టీ లీడరు జగన్నాథం –

"యేటి బావో, జెవాను బావో? సెవులంట నీలు పోస్తన్నావు! ఎప్పడెరగవేటి – వలసల మీదకి రెయిడింగు? సిన్నపుడు తాగిన సేదు – కదిలి పోద్ది. ఆ! పల్లంల – రెల్లోల యిళ్లంట రెయిడింగ్ గాదు – పువ్వుల కోకలూ, ఫుల్ బాటిల్లూ దొరక ఉంకి!" అని యెక సెక్కాలాడేడు.

అసలే కష్టంగా వుంది శంకర్రావుకి. ఈ వ్యంగ్యం కోపం తెప్పించింది. దాంతో శంకర్రావు –

"ఒరే – పల్లంల రెల్లోల యిళ్లల్లే గాదురా – మీ లాంటోలి యిళ్లల్ల దూరినా అడ్డులేదు మాకు. మీమేటి మీలాగ – కంట్రాక్టర్ కూలోలిం గాము. సర్కారు మనుసులుం. మా పవరు ముందు ... మీరే మాత్రంరా... మాతోటి ఆసికాలాడతావా అణాకానీ యెదవా" అని తిట్టేడు.



"ఒసేటీ? సరదాకి యిగటాలాడితే అంత కోపగించుకుంతన్నా డితగాను. పోనలగేని బావ్ – మాం – అణాకానీ వోలిమే. మీరు గొప్పోలు. పవరున్నోలు. ఆ పవరు – ఆ వొలసల – సారా బట్టీ కాడ రెయిడ్ సేసినపుడు సూవుదూ ... సూసెత్తాం" అని జగన్నాథం మెత్తగానే అంటించేడు. శంకర్రావు మాత్రం కోపంతోనే –

"... చేతికి దుడ్డుగర్ర యిచ్చి, సారాపోస్సి; కూల్లు యిచ్చి – మిమ్మల్ని సారా రెంటరు వొట్టిని మేపడం లేదు. ఇలాంటి రెయిడింగులికే మేపుతండు. మేసిన నా కొడుకులు మీరు – యీ కొండలెక్కి దిగి, వంట సారా పట్టాల! అప్పడు మీము కేసు రాస్తాం. అంతేగానీ, మాకేవీ బాదర బందీ. ఎల్లండి, మీరే పట్టుకోండి. ఆ తర్వాత సూపిస్తాం మా తడాఖా" అని గెడ్డలో కాళ్లు జాడిస్తూ జవాబిచ్చేడు శంకర్రావు.

"మీర్రాపోతే మాకు బయ్యమా? మ్మాం పట్టుకోలేమా? రండిరా..." అని మిగిలిన రెఘుడ్ పార్టీ వాళ్లని తీసుకు – బయల్దేరాడు జగన్నాథం. ఆ రేవు ఎవరికీ తెలీదు. తుప్పల్లోంచి గెడ్డ వారంట వెదుకుతూ తిరగసాగేరు. తుప్పల్లో పల్లేరు ముల్లు కాళ్లనీ, ముంజేతి ముడుకుల్నీ గీరేస్తున్నాయి. ఎక్కడా యేవీ అలికిడి లేదు – సర, సరా పారే గెడ్డ నీరు తప్పా!

కొంతసేపటికి ఎక్సయిజ్ జవానులూ – వంట బట్టీ వెదుకులాటకు కదిలేరు. గెడ్డ వారగా నడుస్తున్న వారికి –

"ఓర్నాయినో సచ్చాను" ఎవరిదో కేక; "కొట్టు నా కొడుకుని..." అన్న రెయిడ్ పార్టీ వారి అరు

వులూ విన్పించేయి. ఎక్సయిజ్ జవాన్లు అటువైపు పరుగెత్తారు.

రెయిడ్ పార్టీ జగన్నాధం – చింపిరిజుత్తు గిరిజ నుడ్ని పట్టుకున్నాడు. సన్నగా, పాలిన మొహంతో, పొంగిన పొట్టతో – గోచీ తప్ప వొంటి మీద మరే గుడ్డలేనివాడు – నక్కకు దొరికిన కోడిపిల్లలా మొత్తుకుంటున్నాడు. జగన్నాధం చేతిలో – వాని చింపిరిజుత్తు చిక్కుకుంది.

"యేదిరా? సరుకేదిరా? వంట పొయ్యి యేదిరా?" అని జుత్తు గుంజుతున్నాడు జగన్నాధం.

"నాకేటి తెల్దు. ఇన్ని కల్లు సుక్కలకి ఆశి పడి యిటుకాసి వొచ్చేను. నీవొచ్చీసరకే – వొంట ఆర్పీసుంది. ఎవులలికిట్లేదు. ఉసూరుమని, తిరుగుతన్ను – మీరు పట్టుకున్నారు. అంతకమించి నాకేటి తెల్దు" అంటూ యేడుస్తూ, జుత్తు విడిపించుకోటానికి గింజుకుంటున్నాడు గిరిజనుడు. గబ, గబా చేరిన ఎక్సయిజ్ పోలీసులు, వాడ్ని లాగి, లాఠీతో కొట్టి –

"నువ్విక్కడ చెప్పవు. స్టేషన్‌ల పెట్టి రేవెడితే ... నువ్వే చెప్తావు. మీరంతా యీ చుట్టుపక్కల వెదకండి. వంట గూనలవీ ... దొరకొచ్చు. వీడ్ని మేం తీసికెల్తాం" అన్నారు.

జగన్నాధం, రెయిడ్ పార్టీ వారూ, చుట్టూ వెదకగా, బెల్లపు కుండలు రెండూ, ఖాళీ వంట గూన కన్పించేయి. గూనని పగలగొట్టి, బెల్లం కుండలు పట్టుకొని, జీపు దగ్గరకి తిరుగు ప్రయాణమయ్యారు రెయిడ్ పార్టీ వారు.

రెయిడింగ్ – ఉప్పందిన సొండి గవరయ్య హాయిగా తప్పుకున్నాడు.

** ** **

పట్నంలో దీపాలు వెలిగిన వేళకి – రెయిడ్ పార్టీ జీపు సారా రెంటర్ ఆఫీసు చేరుకుంది.

కంపెనీ యజమాని కేశవునాయుడు దీర్ఘాలోచనలో వున్నాడు. ఎదురుగా మున్సిపల్ – మాజీ చైర్మన్, పార్టనర్ శ్రీరాములూ కూర్చున్నారు. ఆగది ముందర ఓ గుమస్తా కాపలా నిల్చున్నాడు. ఫేను రెక్కల శబ్దం తప్పా – మరేమీ విన్పించని గంభీరత నిండుకుంది గదిలో.

సరిగ్గా అప్పుడు – రెయిడ్ పార్టీ చేరింది. చింపిరి జుత్తు గిరిజనుడ్ని చూపించి, జరిగిన భోగట్టా ఎన్పించేడు జగన్నాధం. అసలే, ఆలోచన తేలక చిరాగ్గా వున్న కేశవు నాయుడుకి – గిరిజనుడ్ని చూసేసరికి విపరీతమైన కోపమొచ్చింది. గభాల్న గదిలోంచి బయటికొచ్చి, గిరిజనుడి గోచీమీద తన్నాడు. గిలగిలా కొట్టుకున్నాడు వాడు.

"...చావగొట్టి, ఆ 'గూనాలస' చింతచెట్టుకి కట్టీయండి నా కొడుకుని" అని ఆజ్ఞాపించాడు కేశవునాయుడు. అది సుగ్రీవాజ్ఞ – రెయిడ్ పార్టీ వారికి. గిరిజనుడ్ని లాక్కుపోయారు రెయిడ్ పార్టీవారు.

తిరిగొచ్చి కుర్చీలో కూర్చొని, కోపంతో వూగిపోతున్నాడు కేశవునాయుడు. కేశవునాయుడికి – అంత కోపం రాకపోను. అసలే, యీ యేడు పాట యెక్కువకి పాడేసాడా? ఇంతలోకి "అన్నల అలికిడి" అని వార్తలు! దాంతో కొంత ఆందోళన. ఆ తర్వాత యిదిగో యీ "వంటసారా" బట్టీల వల్ల కొంత ఆందోళనా... ఇప్పుడేమో మాజీ చైర్మెన్ తెచ్చిన వార్త – మనసుని చికాకుల్లో ముంచేసింది.

కూర్చున్న కేశవునాయుడు, కొద్ది సేపయ్యాక – "... ఇప్పుడెలాగైతే?" అనడిగేడు.

"... అంత వర్రీ యెందుకయ్యా? ఈ ఊరేగింపులుకీ, కేకలకీ కొంపలు మునిగిపోతాయా? అన్నిటికీ – పబ్లిసిటీ కోసం అపోజిషన్ వాళ్లు దిగిపోతారు. నాల్రోజులు పోతే – యేదీ వుండదు. అంతా సల్లబడిపోద్ది" అని సర్దిచెప్పబోయేడు మాజీ చైర్మెన్.

"... అంత తేలిగ్గా ఆలోచించకు. ఆంధ్రా అంతా అంటుకున్నా – మన పట్నం రాగూడదనుకున్నాను. గానీ వొచ్చిందా – మంట! వెంటనే ఆర్పెయాల! ఈ పట్నంల – మన యాపారాలకీ, మనకీ అడ్డుండగూడదు. ఆ" అని దృఢంగా పలికి కుర్చీలోంచి లేచాడు – కేశవునాయుడు.

ఓ క్షణం గదిలో పచార్లు చేసి, జగన్నాధాన్ని కేకేసాడు. జగన్నాధం వచ్చేక – పట్నంలో రిక్షా వాళ్లనీ, మార్కెట్ కళాసీలనీ – పిల్చుకురమ్మని పంపేడు. మాజీ మున్సిపల్ చైర్మెన్ను – రేపటి ఉద్యమకారుల వివరాలు కనుక్కోమని పంపాడు. ఇంతలో టేబుల్ మీది ఫోను మోగింది. కేశవునాయుదు అందుకున్నాడు. రాజధాని నుండి ఫోను

"మిమ్మల్ని కల్చరల్ బోర్డ్ చైర్మన్‌గా నియమించేరు. కంగ్రాచ్యులేషన్స్" అని ఎమ్మెల్యే కంఠం విన్పించింది.

అయినా, కేశవునాయుడిలో ఆవేశం తగ్గలా. అదే చిరాకుతో – "మొగుదు చచ్చి ముండ మోస్తే – కన్నుగొట్టి పిల్చేడట రంకు మొగుడు. ఇక్కడ నా యాపారంకి ముసలం వొచ్చింది" అని ఫోను పెట్టేశాడు.

పార్టనర్ శ్రీరాములు – పనుందని వెళ్ళిపోయాడు. జగన్నాధం – తిరిగొచ్చేడు. జగన్నాధానికి కేశవునాయుడు – కొంత సొమ్మూ, సారా డ్రమ్మూ అప్పజెప్పి –

"రేపటి భారం నీదే. నా వ్యాపారంకి – వీస



## GENE OF MANU

మబ్బునిండిన మనసుల మీద వరదగుళ్లు కట్టగలమా. రాతి చెక్కిళ్ల మీద రాగాలు పూయవ్. నీళ్లు లేని హృదయాల నుంచి అమృతం తీయగలమా. కౌగిళ్లలోమా ఇవప గొలుసుల గలగలుంటయ్.

పగలు కాటేశాక ఆమె కళ్ల నుంచి వంట పొగలూ, కాళ్ల నుంచి సైరన్ మోతా, చేతుల్లోంచి కుప్పలు గొడ్తున్న ధ్వనీ. నాగలో మెషినో అతణ్నీ నమిలి వొదిలేశాక చర్మం నుంచి బస్సులూ టీవీలూ, చెవుల నుంచి వుక్కువానా, చెడిన పాదాల నుంచి బురదపాముల బుసబుస.

దేహదాహాలతో తాపమోహాలతో కామప్రేమాలతో రాత్రిలోకి పోవాల్సినవాళ్లు పెట్రోలు శ్వాసల్లోనో, పొలంలో తోలిన పెంట వాసనల్లోనో, స్మర్శతో ఆమె లోలోన రసయుద్ధాల బదులు రక్త యుద్ధాలు జరుగుతాయని తెలీక (నేనయితే తెలిసే) దగ్గరకు జరుగుతుంటాడు. రెండు తనువులు కరిగి వొకటై ప్రవహించాల్సింది వొక్కడే కరిగిపోతుంటాడు.

బహుశా ఆమె గుండెల్లో నాగలి కర్రుల పోట్లు. ఇంద్రియాలు యేనుగులై తొక్కుతుండొచ్చు. కొంచెం కొంచెంగా శరీరం శిల్పంగా మారుతుండొచ్చు.

అయితేం, అతడు మగవులై తొడల మధ్య కూర్చుంటాడు.

– దెంచనాల శ్రీనివాస్

మెత్తు నష్టం రాగూడదు. నువ్వే కాచుకోవాల" అని చెప్పి – ఇంటికి వెళ్ళిపోయాడు.

జగన్నాధానికి – వొక్కసారిగా నాయుడుగారి మీద గొప్ప భక్తి కలిగింది. నాయుడుగారి వ్యాపారాన్ని – తనే కాచుకోవాలి – అన్న భావన జగన్నాధాన్ని మరింతగా నమ్మినబంటుని చేసింది. జగన్నాధం – చెయ్యవలసిన యేర్పాట్లన్నీ చేసి – నాటు సారా సీసా సగం తాగేసి, మిగిలినది పట్టుకొని – ఇంటికి బయల్దేరాడు. అప్పటికి రాత్రి – మొదటి ఆట సినిమా విడిచిపెట్టారు.

తూలుతూ అడుగులేస్తున్న జగన్నాధం – గడపలో పడుకున్న పిల్లల్లో ఒకరి కాళ్లమీద అడుగేశాడు. 'అమ్మో' అంటూ యేడుపెత్తాడా పిల్లవాడు. "తెత్ ... ఎవుడ్రీడు" అంటూ ఓ తాపు తన్నాడు జగన్నాధం. ఆ తాపుకి, ఆ పిల్లవాడు మరింత గట్టిగా – గావుకేక పెట్టాడు. ఆ కేకలకు ద్వారానికి చేరబడ్డ జగన్నాధం భార్య లేచింది. ఇంట్లోని దీపం వొత్తి పెంచింది. వెల్తురు గడపలో కొచ్చింది. కళ్లు విదుల్చుకుంటూ జగన్నాధం –

"... యేవే? దోవల యీ గుంటల్నేసినావేటీ? మరెక్కడ సోట్లేదా?" అని; భార్యదే తప్పు అన్నట్లుగా కేకలేశాడు.

జగన్నాధం భార్య గొణుక్కుంటూ, పిల్లడ్ని, గడపలో పడకోబెట్టి – అన్నం వొడ్డించడానికి యింట్లోకి వెల్లింది. జగన్నాధం యింట్లో దీపం యెదురుగా – గోడకి చేరబడి కూర్చున్నాడు. కంచంలో అన్నం, తపేలాలో పులుసూ తెచ్చి ముందు పెట్టింది భార్య. అన్నం, పులుసూ చూసి, జగన్నాధం –

"... కూరొండలేదేటీ ... లం...?" అరిచేడు.

"... కూడుకే చేటబట్టుకు తిరిగితే సేరదు బియ్యం దొరకలే. కూరకి – నీవెక్కడ దెచ్చేది? సేతిల రూపాయి పెట్టగూడదా – సేపల కూర సేద్దును" అంది భార్య.

పులుసు కలిపిన ముద్ద – నోటికి చప్పగా, పులుపుగా తగిలేసరికి జగన్నాధంలో యే మూలనో మిగిలిన మానవాంశ నశించి –

"థూత్. నీయమ్మా... ఇది తిండే!" అని తిడుతూ, కంచం విసిరేడు. కంచం తిన్నగా యెగిరి – జగన్నాధం భార్య నెత్తికి తగిలింది. తల చిట్లి, నెత్తురు చిమ్మింది. అమ్మో అంటూ కూలబడింది ఆమె! జగన్నాధం – తిట్టుకుంటూ, మిగిలిన సారా సీసా పట్టుకుని – వీధిలోకి వెళ్ళిపోయేడు.

గాయాలతో – ఆ గుడిసె నిద్రపోయింది!

** ** **

మర్నాడు ఉదయం పది గంటల వేళకి – జగన్నాధం చురుగ్గా యేర్పాట్లన్నీ చేస్తున్నాడు. కేశవునాయుడు దగ్గర వుండి – అన్నీ పురమాయిస్తున్నాడు. సారా కంపెనీ గొడాంలో – అంతా హడావిడిగా వున్నారు. ఓ గంటకు – అనుకున్న విధంగా యేర్పాట్లన్నీ పూర్తిచేసి కేశవునాయుడు వెళ్ళిపోయాడు. జగన్నాధమూ, మరి కొంతమందీ – గొడాం నుండి వెళ్ళిపోయారు.

సారా గొడాంలో – గుమస్తాలు మిగిలేరు. ఎండ నడినెత్తికొచ్చే వేళకి – జనం పోగయ్యారు. రకరకాల బ్యానర్లు పట్టుకు నిలబడ్డారు. ఎవరో కళ్లద్దాల మహిళ –

"సారా కాదు – సాగునీరు, తాగేనీరు కావాలి."

"సారా నిషేధించాలి. సారాజులు నశించాలి".

గొంతెత్తి నినదిస్తోంది. జనం వంతగలిపేరు. రాజకీయ నాయకుడొకాయన – గుంపును ఉద్దేశించి ఉపన్యసించుతూ –

"... గాంధీగారు ఆనాడు విదేశీ వస్తువుల్ని దహనం చేసినట్లు – నేనీనాడు – సారా పేకట్లని దహనం చేస్తాను" అన్నారు. జనం చప్పట్లు కొట్టేరు. కొందరు, సారా గొడాంలోని సారా పేకట్లని ట్రేలల్లో తెచ్చేరు. రాజకీయ నాయకుడు – పేకెట్లని చించి – అగ్గిపుల్ల గీసేరు. పత్రికల వారెవరో ఫోటో తీశారు. నాయకుడు ప్రజల నుద్దేశించి –

"సారా రాజ్యం పోవాలి. ముఖ్యమంత్రి మారాలి" అని నినదించేరు. చేతులెత్తి శలవు దీసుకొని వెళ్ళిపోయారు. వారి వెంట – వారి వందిమాగధులూ వెళ్ళిపోయారు. వారు అంటించిన అగ్గిపుల్ల మాత్రం – 'సుయ్' మంటూ ఆరిపోయింది.

చీపురు పట్టి యింటి మురికిని తుడిచే మహిళలు, భర్త సారా నీళ్లు దాగినందున తమకు గంజినీళ్లయినా దక్కని తల్లులు, సంసారాల్లో సారా చిచ్చుని భరించే కాంతలు – కాళికలై కదిలేరు. ప్రవాహంలా కదిలి – కేశవునాయుడి పాతభవంతిని చేరుకున్నారు.

అక్కడ – కాపలా గాస్తున్న జగన్నాధానికి ఒక్కసారి గుండె ఝల్లుమంది. ప్రళయంలా జనం – గేటు తోసుకువస్తున్నారు. జగన్నాధం – బాణాకర్ర తీశాడు, తోడుగా వుంచిన వాళ్లనీ కర్రలు తీసి కదలమన్నాడు. జగన్నాధం ఆవేశంగా బాణాకర్ర యెత్తి జనం మీద కొచ్చేసరికి –

ఎదురుగా – జన ప్రవాహం ముందు తలకు బ్యాండేజీతో చేతిలో ప్లే – కార్డుతో – భద్రకాళిలా నిల్చుంది భార్య! అలాగే ఆగిపోయాడు జగన్నాధం. జనం విరుచుకుపడ్డారు. జగన్నాధాన్నీ, మిగతా గూండాల్నీ ఆ పాత భవంతి స్తంభాలకు కట్టేరు. ఆ భవంతిలో దాచిన సారా పేకట్లని తెచ్చి కుప్పబోసి – అగ్గిపుల్ల గీశారు!

'భగ్' మని అంటుకుంది. భగ్ భగా, భగా... భగ్ మంటూ మొత్తం పేకెట్లన్నింటికీ – అగ్ని ప్రాకింది. మంటలు ... పెనుమంటలై ఎండవేళ మండుతూ, గాలిలో నాలుకలు చాస్తూ... సారానీ, సమస్త సామాజిక రుగ్మతల్నీ దగ్ధం చేయ... ఎర్రగా ఎగిరింది అగ్ని!

అది – సారాజ్యం మీద మహిళలు చేస్తోన్న 'రెయిడ్'!

## సినారె ఛలోక్తు





1990లో సి.నారాయణరెడ్డిగారిని జంటనగరాలలోని వంద సాహితీ, సాంస్కృతిక సంస్థలు సంగం థియేటర్‌లో సన్మానించాయి. ఆ సభకు మహానటులు అక్కినేని నాగేశ్వరరావుగారు అధ్యక్షులు. అధ్యక్ష ప్రసంగాన్ని ప్రారంభిస్తూ ఆయన "ఇరవై సంవత్సరాల క్రితమైతే బలవంతంగా నాకు అధ్యక్షపీఠం అప్పగించినప్పుడు పెళ్లిపందిట్లో నూతన వధువు కూచున్నంత సిగ్గుతో కూచునేవాణ్ని" అని చెప్పారు. తర్వాత ప్రసంగించిన నారాయణరెడ్డిగారు మాట్లాడుతూ "అవును ఒకప్పుడు వధువులా కూచునే నాగేశ్వరరావుగారు హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత ఇప్పుడు మాలాంటివాళ్లకే వరుడై కూచున్నాడు" అనగానే నాగేశ్వరరావుగారితో సహా సభికులంతా ఫక్కున నవ్వారు.

— శంకరమంచి శ్యాంప్రసాద్, హైదరాబాద్.

– సేకరణ: డాక్టర్ ఎన్. గోపి